క్లుప్తంగా

పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కులు

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డెల్టా శివారు ప్రాంతాలకు సాగునీరందించేందుకు కాలువలకు నీటి విడుదలను మరింత పెంచారు. దీంతో నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువలకు గురువారం అదనంగా 7,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.75 మీటర్లు నమోదయ్యింది. పశ్చిమడెల్టా పరిధిలో ఉప కాలువలకు కూడా నీటి విడుదల పెంచామని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు నరసాపురం కాలువకు 2,280 క్యూసెక్కులు, తణుకు కాలువకు 910 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1,237 క్యూసెక్కులు, ఉండి కాలువకు 1,237 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 563 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నామని వివరించారు.

ఇసుక తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ



పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక గ్రామ రెవెన్యూ పరిధిలోకి వచ్చే గోదావరి లంక పట్టా భూముల్లో మేటలు వేసిన ఇసుకను డీ సిల్టేషన్ చేసుకునేందుకు ప్రభుత్వ అనుమతుల కోసం గ్రామంలో ప్రజాభిప్రాయం సేకరణ చేపట్టారు. ఈ మేరకు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. సర్వే నంబర్ 2లో తొమ్మిది హెక్టార్లలో ఇసుక మేటలు తొలగించాల్సి ఉందని అధికారులు వివరించరాం ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, మైనింశాఖ ఏడీ ఫణి భూషణ్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, ఇతర శాఖాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుపుల పంపిణీ

నిడదవోలు: స్థానిక బీసీ వసతిగృహంలో రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో రోటరీ ఇంటర్నేషనల్, కిరాణా, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బీసీ వసతి గృహాల హాస్టల్ విద్యార్థిని, విద్యార్థులకు గురువారం నిద్రించే పరుపులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికే కీలకం

ఉండ్రాజవరం: అధిక దిగుబడుల కోసం మంచి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు రైతులకు సూచించారు. ఈ మేరకు మోర్త గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ విత్తనాలను తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసిన తరువాత మాత్రమే వాడుకోవాలన్నారు. తద్వారా విత్తనాల ద్వారా సంక్రమించే పలు రకాల పురుగులు, తెగుళ్ల భారి నుంచి పంటను రక్షించుకోవచ్చున్నారు. 75 శాతం మొలక వచ్చినప్పుడే ఆ విత్తనాలను నారుమడిలో వెదజల్లుకోవాలని, ప్రస్తుతం వరినాట్లు 90 శాతం పూర్తియ్యాయని, కలుపు యాజమాన్యంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వరిపంటకు పీఎం ఫసల్ భీమా యోజన పథకం కింద ఆగస్టు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యాన సహాయకురాలు దీప్తి, నాగమణి పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి ఆర్థిక సాయం



దివ్యాంగుల, వృద్ధాశ్రమానికి వాషింగ్ మీషన్, 250 కిలోల బియ్యం అందజేస్తున్న దాతలు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం భారతీ దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల, వృద్ధాశ్రమానికి చిన్నాయగూడెంకు చెందిన మాజీ ఎంపీపీ గడా మురళీ అజీత్‌కుమార్ కుటుంబ సభ్యులు వాషింగ్ మిషన్, 250 కిలోల బియ్యం అందజేశారు. గడా శ్రీవత్స, వాద్దేవి దంపతుల కుమారుడు అజీత్ నంద పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమానికి సుమారు రూ.50 వేల విలువ గల వాషింగ్ మిషన్, 250 కిలోల బియయ విరాళంగా అందజేశారు. ఆశ్రమంలో వృద్ధులకు, దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమానికి తమ వంతు సాయం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగిత భాస్కరరావు, తణుకు మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యా..వ్యాపారమా..?



కొవ్వూరులోని ఓ ప్రయివేట్ స్కూల్లో సిద్ధం చేసిన పుస్తకాలను చూపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



తాళ్లపూడి మండలంలో గత మార్చిలో పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

- ప్రైవేట్ చదువులతో దోపిడీ
- మధ్యతరగతి ప్రజలకు తలకుమించిన భారం
- పెరిగిన ఫీజులు, పుస్తకాల ధరలు

తాళ్లపూడి(కొవ్వూరు): పెరిగిన చదువులు భారాన్ని భరించలేక, ఇంగ్లీష్ మీడియం చదువును మాన్పించలేక తల్లిదండ్రులు మనోవేదన పడుతున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు సైతం ఏదో రకంగా తమ పిల్లలకు కార్పొరేట్ చదువులతో బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలనే తాపత్రయం పడడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇదే అదునుగా ఫీజులను ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి.

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి బ్రతుకుభారమైన ప్రస్తుత రోజుల్లో, అధిక ఫీజులతో ములిగే నక్కపై తాటికాయ పడినట్లు తమ ఆర్థిక పరిస్థితి మారిందని వాపోతున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 3వ సంవత్సరం వచ్చిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలంటే డొనేషన్లు, అడ్మిషన్ ఫీజు, స్కూలు ఫీజులు, యూనిఫాం, షూలు, నోట్ పుస్తకాలతోపాటు, స్టడీ మెటీరియల్, బస్సు ఫీజులు ఇతరాత్ర ఖర్చులు కలిపి సుమారు రూ.18 నుంచి రూ.27 వేలు వరకు చెల్లించాల్సి వస్తోంది. ఊహ తెలియని పిల్లలకి ఇంగ్లీష్, జీకే, గ్రామర్, డ్రాయింగ్, హిందీ, సైన్సు, రకరకాల ప్రాజెక్టులు అంటూ పుస్తకాలు కొనిపించి లేత వయస్సులోనే బండెడు బరువు పుస్తకాల బరువు మోయలేక విద్యార్థులు నీరసించి పోతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి

కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో సుమారు 134 ప్రభుత్వ పాఠశాలలు, మరో 40 వరకు ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 26 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. కొవ్వూరులో సుమారు 14 వేల మంది , తాళ్లపూడి మండలంలో 32 ప్రభుత్వ, మరో 13 వరకు ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 7,500 వేల మందికిపైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. చాగల్లు మండలంలో సుమారు 5,400 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరు కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సుమారు మరో 3 వేల మంది వరకు ఉంటారు. సాధారణ మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలను చదివించాడానికి ఫీజుల మోతతో వివిధ రకాలుగా ఆర్థిక దోపిడికి గురవుతున్నారు.

ఫీజుల భారంతో బెంబేలు..

గత ఏడాది కంటే మార్కెట్లో 30 శాతం ధరలు, ఫీజులు పెరిగినప్పటికీ తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా వీటిని సమకూర్చక తప్పడం లేదని తల్లిదండ్రులు అంటున్నారు. తాళ్లపూడి మండలంలో ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకయితే ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు అవసరమైన నోటు పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు, వ్యాను, ఆటో ఫీజులు, పాఠశాల ఫీజులు అన్ని కలిపి ఏడాదికి సుమారు రూ.29 వేల నుంచి రూ. 60 వేల వరకు ఖర్చవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతికి అయితే ఈ ఖర్చు రూ.60 నుంచి రూ.90 వేలకు పైగా అవుతుంది. కొవ్వూరుకు బస్సు ఫీజు ఒక్కటే రూ.12 వేల నుంచి రూ.16 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

అరకొర వసతులు..

ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రవేట్, కార్పొరేట్, టెక్నో స్కూళ్ల మధ్య పోటీ అధికంగా ఉండటం, పాఠశాలలు విపరీతమైన ప్రచారాలు నిర్వహిస్తు తల్లిందండ్రులను గందగోళంలో పడేస్తున్నాయి. పైగా ఇక్కడ వసతులు తక్కువ, ప్రచార ఆర్భాటాలు ఎక్కువ. నిబంధనలు పూర్తి స్థాయిలో అమలు జరగని దుస్థితి. కొన్ని పాఠశాలలు అయితే పదో తరగతి విద్యార్థులపైనే దృష్టి పెడుతున్న సందార్భాలున్నాయి. దింతో తమ పిల్లలను ఎక్కడ చదివించాలో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ఇదిలా ఉండగా డొనేషన్లు, బ్యాగ్‌లు, యూనిఫాంలు, షూలు, సైకిళ్ల వంటి సమకూర్చడంలో తల్లిదండ్రులకు తంటాలు తప్పడం లేదు.

తలకు మించిన అప్పులతో

సామాన్యులు, మధ్యతరగతి కుటుంబీకులు కూడా తమ పిల్లల చదువుల కోసం జూన్, జూలై నెలల్లో ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొవాల్సిన పరిస్థితి వస్తుంది. కాన్వెంట్ స్కూళ్లల్లో చదవాలని ఆశతో ఖర్చుకు వెనుకాడక అప్పులు చేసి మరీ వీటిని సమకూరుస్తున్నారు. అప్పులు తెచ్చి మరీ పిల్లల చదువుల కోసం అవసరమైన వాటిని సమకూర్చాల్సి వస్తుందని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ప్రయివేట్ స్కూళ్లల్లో ఒక్కో విద్యార్థికి అడ్మిషన్ ఫీజు రూ. 2 వేలు నుంచి రూ. 6 వేలు, యూనిఫాంకు ఒక్కో జతకు రూ.1,300 నుంచి రూ.1,800, పుస్తకాలు, స్టడీ మెటీరియల్, నోట్ బుక్స్‌కు రూ.3 వేలు నుంచి 10 వేలు వరకు వసూలు చేస్తున్నారు. షూలు రూ.300, ఆటో ఛార్జీలు రూ.600 నుంచి రూ.1,200, బ్యాగ్ రూ.200 నుంచి రూ.500, ఇతరత్రా స్టేషనరీ కలిపి రూ.500 మొత్తం కలిపి రూ.8 వేల నుంచి రూ.18వేలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని అంచనా.

నిబంధనలు అమలు చేయాల్సిందే..



ప్రయివేట్ పాఠశాలలు నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను మాత్రమే అందజేయాలి. ప్రయివేట్ స్కూళ్లలో నిబంధనలు పాటించకున్నా, అధిక ఫీజులు వసూలు చేసినా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అన్ని వసతులు కల్పించాలి.

-సీహెచ్ బాలామణి, ఎంఈవో తాళ్లపూడి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ రూరల్ ఫీడర్ పరిధిలోని ఆర్డీఎస్ పనులు చేపడుతున్నామని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్ర, శనివారాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సూచించారు.

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి, తాడిమళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విజ్జేశ్వరం, గోపవరం, పురుషోత్తపల్లి, పందలపర్రు, డి.ముప్పవరం,కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, మునిపల్లి, పెండ్యాల, తిమ్మరాజుపాలెం, తాడిమళ్ల, రావిమెట్ల, శంకరాపురం గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా ఈనెల 18 తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ, పరిశ్రమ, వ్యవసాయానికి సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో తనిఖీలు

తాళ్లపూడి: (కొవ్వూరు) పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పలు వార్డులను పరిశీలించి ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతూ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూరపనేని చిన్ని, కంఠమణి రామకృష్ణ పాల్గొన్నారు.

చేనుకు సాగునీటి ఎద్దడి



నీటి ఎద్దడితో కృష్ణంపాలెంలో దెబ్బతిన్న వరి చేలను పరిశీలిస్తున్న సంజన

దేవరపల్లి: ఖరీఫ్ ప్రారంభంలోనే రైతన్నకు ఎదురు దెబ్బ తగిలింది. ఇటీవల నాటిన నాట్లు నీటి ఎద్దడితో దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో బీటలు వారుతున్న వరి చేలు అనే శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కృష్ణంపాలెంలో దెబ్బతిన్న పొలాలను వ్యవసాయ శాఖ మండల విస్తరణ అధికారిణి సీహెచ్ సంజన రైతులను వెంటబెట్టుకుని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు కర్రి మురళీకృష్ణారెడ్డి, కడలి చిరంజీవి మాట్లాడుతూ దాదాపు 45 రోజుల నుంచి వరుణుడు జాడలేకపోవడం, వేసవిని తలపించే విధంగా ఎండల తీవ్రత, భూగర్భజాలాలు అడుగంటి నీటి మట్టం తగ్గి మోటార్లు సరిగా నీరు తోడకపోవడం, అన్నిటికంటే ప్రధానంగా తాడిపూడి కాలువకు 10 నుంచి 15 రోజులు ఆలస్యంగా నీరు విడుదల చేయడంతో వరిచేలు బీటలు తీసి నాట్లు ఎండిపోయాయని రైతులు ఆమెకు వివరించారు. జూన్ నెలలో కురిసిన వర్షాలకు వరినాట్లు వేసినట్టు రైతులు వివరించారు. నీటి ఎద్దడి వల్ల వారం రోజులుగా చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం కాలువకు నీరు విడుదుల చేయడంతో ఇప్పుడిప్పుడే నీరు చేలల్లోకి చేరుతుందని రైతులు వివరించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో చేల పరిస్థితి కుదుటపడవచ్చునని ఆశిస్తున్నట్టు రైతులు తెలిపారు. వచ్చే సార్వా సీజన్ నుంచి జూన్ చివరివారంలో కాలువకు నీరు విడుదల చేస్తే నీటి ఎద్దడిని అధిగమించవచ్చునని రైతులు సూచించారు.

ఓటర్ల జాబితాను నిత్యం పరిశీలించాలి



శిక్షణ పూర్తయిన బీఎల్‌వోలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీటీ సాంబశివరావు

గోపాలపురం: ఎన్నికల నియామవళిని అనుసరించి పనిచేయాల్సిన బాధ్యత ప్రతి బూత్‌లెవెల్ అధికారిపైనా ఉందని నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పీవీ.సాంబశివరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోల శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్‌లెవెల్ అధికారి తమకు కేటాయించిన పరిధిలో ఉన్న ఓటర్లు, జాబితాపై పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. మరణించిన ఓటరు, కొత్త ఓటర్ల జాబితా తయారీ ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల బీఎల్‌వోలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి. భాగ్యవతి సూచనలు సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కాట్రు నల్లరాజు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నిడదవోలు: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సిబ్బంది గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జువ్వల రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

అగ్రకుల దాడులను ఖండించాలి

నిడదవోలు రూరల్: దళితులపై అగ్రకుల, ఉన్మాదుల దాడులను ప్రతిఘటించాలని కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్)జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు పిలుపునిచ్చారు. మండలంలోని సమిశ్రగూడెంలో కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్‌రాజ్ అధ్యక్షతన కారంచేడు దళిత మృతవీరుల వర్ధంతి సందర్భంగా గురువారం నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిడికెడు ఆత్మగౌరవం, భూమి, భుక్తి కోసం పరితపిస్తున్న దళితులపై, గిరిజనులపై అగ్రకుల ఉన్మాదుల దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు దిద్దే రాజు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయ సంప్రోక్షణం



తాడిపర్రు పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేదమంత్రాలతో పూజలు, హోమాలను వైభవంగా చేపట్టారు. పార్వతీ సమేత సోమేశ్వరస్వామికి తొమ్మిది రకాల ద్రవ్యాలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని హోమాలు తిలకించి, స్వామి వారిని దర్శించుకున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



అంగన్‌వాడీలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సృజన

ఉండ్రాజవరం: గర్భిణి మహిళలు మంచి విలువున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యులు వైసృజన అన్నారు. మండలంలో వేలివెన్ను-2లో గురువారం సంచార చికిత్స ప్రోగ్రాం 104 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న గర్భిణులను పరీక్షించి, తీసుకోవాల్సిన పోషక ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఐరన్ మాత్రల గురించి డాక్టర్ సృజన వివరించారు. రక్తహీనత ఉన్న గర్భిణులు వెంటనే స్థానిక పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతతో పాటు టీనేజీ బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్యా వివాహం జరిగి గర్భం దాలిస్తే వచ్చే ఇబ్బందులపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కె.సుభాషిణి, ప్రత్యూష, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, 104 డీఈవో అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారెను సమర్పించడానికి వెళ్తున్న మహిళలు

చాగల్లు: మండలంలోని చాగల్లు గ్రామంలోని కొనేరు వీధిలో వెంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పలురకాల వంటకాలు, స్వీట్లతో తయారుచేసిన సారెను భక్తి శ్రద్ధలతో మహిళలు గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజాలు చేశారు. మహిళల ఆధ్వర్యంలో గ్రామోత్సవం చేసి మంగళ వాయిద్యాలతో సారెను అమ్మ వారికి నైవేద్యంగా అందించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌కు ఫర్నిచర్ బహూకరణ



ఫర్నిచర్ బహూకరిస్తున్న రిటైర్డు ఉపాధ్యాయుడు నెక్కలపూడి ప్రతాప్

నల్లజర్ల: మండల కేంద్రం నల్లజర్లలోని స్థానిక ప్రత్యేక అవసరాల పిల్లల భవిత సెంటర్‌కు రిటైర్డు ఉపాధ్యాయుడు నెక్కలపూడి ప్రతాప్ దాదాపు రూ.30వేలతో రౌండ్ టేబుల్, కుర్చీలను గురువారం సిబ్బందికి అందజేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల అవసరాన్ని గుర్తించి ఫర్నిచర్ సమకూర్చడం అభినందనీయమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వై.సత్యనారాయణ, భగవతి, మానవత సమన్వయకమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ, నందం రాజేంద్రప్రసాద్, సహిత విద్యా జిల్లా సమన్వయ కర్త ఎస్.కనకబాబు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు రష్మిత, బి.రామచంద్ర,హెచ్ఎం కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ కాంపోజిట్ కళాశాలను వేరు చేయాలి

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి కాంపోజిట్ కళాశాలగా నడుస్తున్న డిగ్రీ, ఇంటర్ కళాశాలలను వేరు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం ఇంటర్మీడియట్ కమిషనర్ కృతికా శుక్లా, ఉన్నత విద్యా మండలి డైరెక్టర్ నారాయణ భారత్ గుప్తాకు వినతిపత్రం అందించింది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా కందుకూరి విద్యాసంస్థలు జీవో నెం.42 ప్రకారం ప్రభుత్వ పరమయ్యాయన్నారు. అయితే కళాశాల కంపోసిట్ కళాశాలగా నడుస్తుందని దీన్ని వేరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మాట్లాడుతూ రాజ్యలక్ష్మి కళాశాలలు ప్రభుత్వ పరం అయినా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు రావడం లేదని, మధ్యాహ్న భోజనం పథకం అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.జ్యోతిర్మయి, నాగ చైతన్య, కార్తిక్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో పుంతలో ముసలమ్మవారు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం గ్రామంలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ అమ్మవారికి ఆషాఢంమాసం పురస్కరించుకుని భక్తులు గురువారం శాకంబరి రూపంలో అలంకరించారు. ఈ మేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు కలగాకుండా ఏర్పాట్లు చేశారు.

జంతువుల సంరక్షణ సొసైటీలు ఏర్పాటు చేయాలి

- నిబంధనలు పాటించకుంటే చర్యలు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: జంతువుల సంరక్షణ సొసైటీలను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎస్‌పీసీఏ (జంతువులపై హింస నివారణకు సొసైటీల ఏర్పాటు, నియంత్రణ) నియమాలపై తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల అధికారులతో జిల్లా కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జంతు హింస నివారణ చట్టాల అమలులో అలసత్వం ఉండరాదన్నారు. ఎస్‌పీసీఏ నియమాలను పాటించకపోతే కోర్టు ధిక్కారణ చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జంతువులపై హింసను నివారించడానికి సొసైటీలను ఏర్పాటు చేయాలన్న నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కొన్ని జిల్లాలలో సొసైటీలు, షెల్టర్లు లేవన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. వీటి కోసం అవసరమైన భూమి, నిధులు కేటాయించాల్సిందిగా ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. సొసైటీల వివరాలు, వాటి ద్వారా సంరక్షించబడిన జంతువుల సంఖ్య తదితర సమాచారాన్ని ప్రతి నెలా డీఎల్ఎస్ఏకు పంపాలన్నారు. హైకోర్టు తీర్పులో సూచించిన జంతు సంరక్షణ చర్యలను తప్పక తీసుకోవాలన్నారు. జంతువులకు హక్కులు ఉంటాయని, వాటిని తరలించేటప్పుడు పశుగ్రాసం , నీరు తప్పక అందించాలన్నారు. వాహనాలలో కనీసం కదిలే అవకాశం కూడా లేకుండా, పరిమితికి మించి జంతువులను తరలించడం క్రూరత్వం కిందకు వస్తుందన్నారు. అక్రమంగా జంతువులను తరలిస్తున్న వారిపై పోలీసులు, రవాణా శాఖాధికారులు కేసులు నమోదు చేయాలన్నారు. పట్టణాలలో జంతువులను రోడ్లపై విడిచిపెట్టరాదని యజమానులకు సూచించారు. గాయపడిన జంతువుల చికిత్సకు అంబులెన్సులు ఉన్నాయని, దీనికి 1962 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశ్రమలపై మహిళలకు అవగాహన

తాళ్లపూడి: ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలని భావిస్తూ ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించేందుకు చర్యలు చేపట్టిందని వెలుగు శాఖ మండల ఏపీఎం మంగాయమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం తాళ్లపూడి వెలుగు కార్యాలయంలో మహిళలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశామని, అందరు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. డ్వాక్రా సంఘాలలో ఉన్న సదరు మహిళల భర్తలు కూడా హాజరు కావచ్చన్నారు. అనుభవం, ఆసక్తి ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని ఆమె సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రతినిధులు, క్వాయర్ బోర్డ్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సభ్యులు, బ్యాంక్ మేనేజర్లు హాజరవుతారని వివరించారు. ఆధార్, పాన్ కార్డులు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో సమావేశానికి రావాలన్నారు.

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని కుమారదేవం గ్రామంలో వెంచేసియున్న శ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఆలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రమాణా స్వీకారం కార్యక్రమంలో పాల్గొని కమిటీ చైర్మన్ సుంకవల్లి వెంకటేశ్వరరావు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.